ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 24 ఫిబ్రవరి 2024



పోలవరం ఎవరికో..

పొత్తులో టిక్కెట్ నీదా.. నాదా ?

ఎవరికిస్తే ఆ పార్టీలోకి వెళ్లడానికి జంప్ జిలానీలు సిద్ధం

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 23 : పోలవరం సీటు ఏ పార్టీకి కేటాయిస్తారు ? ఇదే నియోజకవర్గ టీడీపీ, జనసేన శ్రేణుల్లో ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఇరు పార్టీల వారు పొత్తులో భాగంగా తమ పార్టీ నేతకే కేటాయిస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎస్టీ నియోజకవర్గమైన పోలవరంలో ఇప్పటికే అధికార వైసీపీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సతీమణి రాజ్యలక్ష్మిని సమన్వయకర్తగా నియమించారు. దాదాపుగా ఆమె బరిలో నిలుస్తారు. ఇక పొత్తులో భాగంగా నియోజకవర్గంలో పోలవరం ప్రాజెక్టు ఉన్నందున సీటును వదులుకోబోమని టీడీపీ వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. రాష్ట్ర సమీకరణాలను బట్టి ఎస్టీ కోటలో ఈ సీటును జనసేనకే కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఈ పార్టీ వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి. ఇక్కడ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జనసేన పార్టీ కన్వీనర్ చిర్రి బాలరాజు తమ ప్రచారాలను ముమ్మరం చేశారు. ఇటీవల జనసేనకు ఈ స్థానాన్ని కేటాయిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం సాగటంతో ఈ పార్టీలో జోష్ పెరిగింది. అయితే ఇంకా అధికారికంగా ప్రకటించలేదని ఇది టీడీపీకే కేటాయిస్తారంటూ ఆ పార్టీలో ప్రచారం జరుగుతోంది. దీనిపై నియోజకవర్గమంతా రెండు పార్టీలోనూ తీవ్ర చర్చ సాగుతుంది. ఇది ఎవరికి కేటాయించినా సమన్వయంతో పని చేయాలంటూ సీనియర్ నాయకులు ఇరు పార్టీల నాయకులకు హితబోధ చేస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కూటమిలో ఈ సీటు ఎవరికి కేటాయిస్తారోనని జంపు జిలానీలు వేచి చూస్తున్నారు. టీడీపీకి కేటాయిస్తే ఆ పార్టీలోకి.. జనసేనకు ఇస్తే ఈ పార్టీలోకి వెళ్లేందుకు జంప్ జిలానీలు వెయిట్ చేస్తున్నారు. అధికార పార్టీలో కొంత కాలంగా అసంతృప్తితో ఉన్న నాయకులు పార్టీ మారే ఆలోచనలో ఉన్నారు. ఆ దిశగానే టీడీపీ, జనసేన పార్టీ ముఖ్య నాయకులతో టచ్‌లో ఉంటున్నారు. ఏ పార్టీకి టిక్కెట్ ఇస్తే అందులో చేరేందుకు సిద్ధంగా వున్నట్లు చెబుతున్నారు.

బీజేపీ జిల్లా కమిటీ ప్రకటన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 23 : బీజేపీ జిల్లా కమిటీని కొద్దిపాటి మార్పులతో ఏర్పాటు చేసినట్టు జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎం.శివయ్య, ముదునూరి నాగమణి, కొండపల్లి నగేష్, శీలా లక్ష్మీపార్వతి, బలుసు మాధవీలత, కొమ్మన నాగబాబు, బుంగా బుజ్జమ్మ, ప్రధాన కార్యదర్శులుగా అల్లూరి సాయి దుర్గారాజు, కొవ్వూరి వెంకటరెడ్డి, కోమటి రవికుమార్, పులవర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా అరసవల్లి సుబ్రహ్మణ్యం, గునిశెట్టి శ్రీనివాసరావు, కర్రి కృష్ణారెడ్డి, ఆకుల లీలాకృష్ణ, కె.రమాదేవి, ఎం.దిలీప్‌కుమార్, జి.చంద్ర, ఎం.చిట్టిరాజు, కె.నరసింహారావులను నియమించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షునిగా కలిదిండి వినోద్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షునిగా దాసరి బాబి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా అల్లూరి పద్మవర్మ, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా ఇంజేటి వెంకటేశ్వరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా గునిపల్లి పుల్లాజీ, జిల్లా మైనార్టీ అధ్యక్షునిగా షేక్ మోహిద్దీన్‌ను నియమించారు.

ఉమ్మడి వీరులెవరు?





తణుకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం దారి పొడవునా వివిధ వర్గాల వారిని పలకరించి వారి కష్టాలు తెలుసుకున్నారు. ఓ చిరు వ్యాపారి పొయ్యి వద్ద ఆగి ఇలా పకోడీ వేస్తూ కనిపించారు.

టీడీపీ-జనసేన తొలి జాబితాలో చోటెవరికి

- నేడో, రేపో పలువురి అభ్యర్థుల ప్రకటన
- ఇరు పార్టీ శ్రేణుల్లోనూ తీవ్ర ఉత్కంఠ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జనసేన-తెలుగుదేశం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నాయి. అధికార వైసీపీలో దడ పుట్టించేలా పసుపు, జనసైన్యం వెల్లువలా తరలివచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు ఈ సభకంటే ముందే రెండు పార్టీల అభ్యర్థులతో అధికారక తొలి జాబితా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఏ పార్టీకి ఆధిక్యత లభిస్తుందో ఆ పార్టీయే అధికారంలోకి రావడం ఖాయం. ఈ సారి రాజకీయ చిత్రపటంలో 2014 ముఖ చిత్రం మళ్లీ ఆవిష్కృతమయ్యేలా టీడీపీ-జనసేన పొత్తుకు దిగాయి. ఈ రెండింటితోపాటు బీజేపీ జత కడుతుం దని ప్రచారం ఉంది. దీనికి తగ్గట్టు టీడీపీ అధినేత చంద్ర బాబు బీజేపీ అగ్రనేత అమిత్ షాతో భేటీ కావడం, ఆ తర్వాత రెండు పార్టీల వైపు నుంచి పెద్దగా పురోగతి కనిపించకపోవడంతో అప్పటి నుంచి ఆశావహులందరిలోనూ ఆతృత ఏర్పడింది. జనసేనతో పొత్తు దరిమిలా ఆ పార్టీ ఎక్కువ స్థానాలు ఆశిస్తున్నట్టు జరిగిన ప్రచారం టీడీపీ వర్గాల్లో ఉత్కంఠ పెంచింది. వాస్తవానికి గోదావరి జిల్లాల్లో తమ పార్టీకి తగినంత ఆదరణ ఉన్నందున దీనికి తగ్గట్టుగానే పొత్తులో భాగంగా ఎక్కువ స్థానాలు సాధించగలుగుతామనే ధీమా జనసేనలో కనిపించడం, దీనికి తగ్గట్టుగానే తాము ఆశిస్తున్న స్థానాలు చేజారిపోతాయనే బెంగలో టీడీపీ వర్గాలున్నాయి. తెలుగుదేశం అధినేత చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించి జైలుకు పంపిన తర్వాత రాజకీయ పరిణామాలు టీడీపీ వైపు మళ్లాయి. ఇదే క్షణంలో టీడీపీతో పొత్తు ఉంటుందని, దానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని ఇరు పార్టీలూ ఒక్కటై వచ్చే ఎన్నికల్లో అధికార వైసీపీని మట్టి కరిపిస్తామని జనసేనాధిపతి పవన్ కల్యాణ్ ప్రకటించారు. దీనితర్వాతే పొత్తు ఖరారు కాగా ఇరు పార్టీల్లోనూ ఒక విశ్వాసం కలిగింది. చాన్నాళ్లగా ఏ ఏ స్థానంలో జనసేన, టీడీపీ అభ్యర్థులు పోటీ చేయబోతున్నారన్న దానిపై రకరకాల ఊహాగానాలు ప్రచార మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. కొన్నిసార్లు ఇరు పార్టీల కేడర్‌లలో కాస్తంత గందరగోళం, ఉద్రిక్తత నెలకొంది. ఇప్పుడది సమసిపోగా, తొలి జాబితా నేడో రేపో విడుదల కాబోతున్నట్టు ప్రచారం. ఈ జాబితాలో ఉమ్మడి పశ్చిమ గోదావరికి సంబంధించి ఏ ఏ స్థానాలు ఉండబోతున్నాయనేది అందరిలోనూ కలవరం కలిగిస్తోంది. ఇప్పటికే భీమవరం నుంచి పవన్ కల్యాణ్ తిరిగి పోటీ చేస్తారని ఆ పార్టీ సంకేతాలిచ్చింది. తొలి జాబితాలో ఆయన పేరు అధికారికంగా ఉంటుందా.. లేదా అనేది చూడాలి. భీమవరం పర్యటనకు వచ్చిన ఆయన టీడీపీ, బీజేపీ నేతల నివాస గృహాలకు వెళ్లి వారితో ఏకాంతంగా సంభాషించి కలిసి మెలసి పనిచేద్దాం అంటూ తేల్చేసినట్టు చెబుతున్నారు. కాపు సామాజిక వర్గమే కాకుండా మిగతా వర్గాల మద్దతు వీలుగానే పర్యటన సాగింది. స్థానిక నియోజకవర్గ రాజకీయ పరిణామాలపై ఆసాంతం స్టడీ చేసిన పవన్ తాను భీమవరం నుంచి పోటీ చేస్తున్నట్టు బహిరంగంగా ప్రకటించకపోయినా, తన పార్టీ అంతర్గత సమావేశాల్లో దీనిపై ఆయన దృష్టి పెట్టడంతో భీమవరం నుంచి పోటీ ఖాయమని ఇప్పటికే ధ్రువపడింది.



విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు పొత్తూరి రామరాజు, బూరుగుపల్లి శేషారావు, వలవల బాబ్జి, సీతారామలక్ష్మి, రవి, ఎమ్మెల్యే మంతెన రామరాజు, బడేటి చంటి

ఎవరికి ఎన్నెన్ని..

తొలి జాబితాలో తెలుగుదేశానికి ఎన్ని, జనసేనకు ఇంకెన్ని అనే ప్రశ్న ఇప్పుడు అందరి నోటా నానుతోంది. ఉమ్మడి జిల్లాలో జనసేనకు అనుకూలంగా ఒకటి రెండు స్థానాలు ప్రకటించవచ్చని భావిస్తున్నారు. లేదా ఏలూరు, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గాల్లో మూడు అసెంబ్లీ స్థానాలను ప్రకటించే అవకాశాల పైనా చర్చ సాగింది. తొలి జాబితాలో పాలకొల్లు నుంచి నిమ్మల రామానాయుడు, ఆచంట నుంచి పితాని సత్యనారాయణ, దెందులూరు నుంచి చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు నుంచి గన్ని వీరాంజనేయులు, ఏలూరు నుండి బడేటి చంటి, తణుకు ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం మద్దిపాటి వెంకట్రాజు, నూజివీడు నుంచి కొలుసు పార్థసారధి, చింతలపూడి నుంచి రోషన్‌కుమార్ పేర్లు ఉండే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. వీటితో పాటు మరికొన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే స్పష్టత ఉండగా జనసేన నుంచి ఒత్తిడి పెరిగితే ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఒకటి రెండు స్థానాల్లో మార్పులు ఉండవచ్చనే అభిప్రాయంతో టీడీపీ నేతలున్నారు.

ఉమ్మడి సభకు ఏర్పాట్లు

విజయవంతానికి టీడీపీ నేతల పిలుపు

పెంటపాడు, ఫిబ్రవరి 23: వైసీపీ దుర్మార్గపు పాలనను అంతమొందించే ఉద్దేశంతోనే టీడీపీ, జనసేన ఉమ్మడిగా కలిసి ముందుకు వెళుతున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. ఈ నెల 28న ప్రత్తిపాడు జాతీయ రహదారి సమీపంలో జరిగే టీడీపీ, జనసేన ఉమ్మడి బహిరంగ సభా ప్రాంగణాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం పూర్తిగా వెనుకపడింది. పోలవరం పూర్తికాలేదు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకే చంద్రబాబు, పవన్ ఉమ్మడిగా ముందుకు వచ్చారు' అని అన్నారు. జోన్-2 కో ఆర్డినేటర్ మందలపు రవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది ఈ సభకు రానున్నట్లు చెప్పారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే అరాచకాలను అంతమొందించేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ రాష్ట్ర పరిస్థితులపై బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ దిశా నిర్దేశం చేయనున్నారన్నారు. వైసీపీ పాలనలో ఉభయ పార్టీల నాయకులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు మనందరి సత్తా చూపించాల్సిన సమయం వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, ఏలూరు, నరసాపురం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బడేటి చంటి, పొత్తూరి రామరాజు, గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

అందరి కళ్లు గూడెంపైనే

మూడు పార్టీలు.. నలుగురు అభ్యర్థులు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థులపై ఉత్కంఠ నెలకొంది. నరసాపురం పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని ఆరు అసెంబ్లీ సీట్లపై అధికార పార్టీలో ఒక స్పష్టత వచ్చింది. పోటీ చేసే అభ్యర్థులను దాదాపు ఖరారు చేసింది. కాని, తాడేపల్లిగూడెంలో మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొట్టు సత్యనారాయణ మాత్రం మళ్లీ బరిలో నిలిచేది తానేనంటూ ధీమాతో ఉన్నారు. పార్టీ శ్రేణుల్లో ఆ ధీమా కానరావడం లేదు. ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేతలు రోజురోజుకూ అధికమవుతున్నారు. అధిష్ఠానం సానుకూలంగా లేదంటూ పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే పార్టీ కార్యక్రమాలకు కీలక నేతలు దూరంగా ఉంటున్నారు. తొలి నుంచి అసంతృప్తి నాయకులైతే ప్రత్యామ్నాయ అభ్యర్థి కోసం చూస్తున్నారు. ఐ పాక్ బృందం నియోజకవర్గంలో జల్లెడ పడుతోంది. వైసీపీ నుంచి ఎవరు పోటీ చేస్తే అనుకూలంగా ఉంటుందో తర్జనభర్జనలు పడుతున్నారు. ప్రజల నాడి తెలుసుకుంటోంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ఈలి నాని పైనా చర్చ నడుస్తోంది. ఆయన పోటీ చేయడం ఖాయమంటూ అతని అనుచరవర్గం విశ్వాసంతో ఉంది. అధికార పార్టీ శ్రేణులు నాని వైపు చూస్తున్నాయి. అయితే ఆయన గుంభనంగా ఉంటున్నారు. ఆయన తన వ్యూహం బయట పడకుండా జాగ్రత్త పడుతున్నారు. మరోవైపు తెలుగుదేశం - జనసేన కూటమి అభ్యర్థిపైనా ఆసక్తి నెలకొంది. నియోజకవర్గంలో ఎవరు బరిలో ఉంటారన్న అంశంపై జనమంతా గుక్క పట్టి ఎదురుచూస్తున్నారు. తెలుగుదేశంలో వలవల బాబ్జి, జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ రేసులో ఉన్నారు. ఇప్పటికే పార్టీ కార్యక్రమాలతో బాబ్జి నియోజకవర్గ పర్యటనలు పూర్తిచేశారు. పల్లె పోరుతో బొలిశెట్టి గ్రామాలు, పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఇరువురిలో ఎవరికి టిక్కెట్ వస్తుందంటూ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌ల నిర్ణయం మేరకే ఈ టిక్కెట్ ఆధారపడి ఉంది. ఉమ్మడి సభలోగా ఒక స్పష్టత వస్తుందని పలువురు భావిస్తున్నారు. మొత్తంగా రెండు ప్రధాన పార్టీల్లో నలుగురు నేతల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.



ప్రత్తిపాడులో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మనోహర్, బొలిశెట్టి (ప్రధాన వార్త మెయిన్‌లో)

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం : మనోహర్

పెంటపాడు, ఫిబ్రవరి 23 :ప్రత్తిపాడు జాతీయ రహదారి సమీపంలో జరిగే టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని శుక్రవారం తాడేపల్లిగూడెం జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సందర్శించారు. సభా వేదిక, హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పొత్తులో భాగంగా ఎవరికి సీటు దక్కినా ఎవరూ బాధపడరని చెప్పారు. సభకు తరలి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలన్నారు. ఆయా పార్టీల ఇన్‌చార్జిలు, జనసేన నాయకులు చేగొండి సూర్యప్రకాశ్, కనకరాజు సూరి, కేకే మహేందర్‌రెడ్డి, హరిప్రసాద్, విడవాడ రామచంద్రరావు, రెడ్డి అప్పలనాయుడు, మేకా ఈశ్వర య్య, చిర్రి బాలరాజు, డీవీవీ ప్రసాద్, పత్సమట్ల ధనరాజు, జుత్తిగ నాగరాజు, చనమల్ల చంద్రశేఖర్, కరాటం సాయి, ఇల్లా శ్రీనివాస్, చాగంటి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అలుగులగూడెం వద్ద అండర్ పాస్ లోబ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

26న ప్రధాని మోదీతో అండర్ పాస్‌లు ప్రారంభం

దెందులూరు/ అత్తిలి, ఫిబ్రవరి 23 : అమృత్ పథకంలో నిధులు కేటాయించి ఉమ్మడి పశ్చిమ గోదావరిలో నిర్మించిన మూడు అండర్ పాస్ లో బ్రిడ్జిలను ఈ నెల 26న వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. దెందులూరు మండలం అలుగులగూడెం-దెందులూరు రైల్వే ట్రాక్ వద్ద ఒకటి, అత్తిలి మండలం ఆరవల్లి-స్కిన్నెరపురం, అత్తిలి-మంచిలి మధ్య ఈ రైల్వే అండర్ పాస్‌లను నిర్మించారు. అత్తిలి మండల పరిధిలో నరసాపురం ఎంపీ రఘురామకృష్ణం రాజు అభ్యర్థన మేరకు అండర్ పాస్ వంతెనలు మంజూరు చేశారు. వంతెనలు పూర్తి చేసిన సందర్భంగా ప్రధాని మోదీకి ఎంపీ రఘురామకృష్ణంరాజు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణం పూర్తయిన అలుగులగూడెం - దెందులూరు అండర్ పాస్ లోబ్రిడ్జిని శుక్రవారం రైల్వేశాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎన్. గణేశన్, రైల్వే అధికారులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1500 అండర్ పాస్ బ్రిడ్జిలను నూతనంగా నిర్మించారని, అలుగులగూడెంలో రూ.ఐదు కోట్లతో అండర్ పాస్ 250 మీటర్ల పొడవున, రెండు వైపులా రక్షణ గోడ నిర్మించినట్టు తెలిపారు. వారి వెంట రైల్వే అధికారులు ప్రసాద్, శ్రీనివాస్, సహకార బ్యాంక్ డైరెక్టర్ మోటపర్తి రాంబాబు ఉన్నారు.

రేపు గ్రూప్-2 పరీక్షలు

13,977 మంది అభ్యర్థులు.. 39 పరీక్షా కేంద్రాలు

కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్..కంట్రోల్ రూమ్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : జిల్లాలో ఈనెల 25న నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్షల కోసం ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని, 39 పరీక్షాకేంద్రాల్లో 13,977 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 19 మంది రూట్ ఆఫీసర్లు, 39 మంది లైజన్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పోలీస్ బందోబస్తు నిర్వహించాలని కేంద్రాల వద్ద మెడికల్ టీమ్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఎస్పీ స్వరూపరాణి, ఇన్‌చార్జ్ డీఆర్వో ఖాజావలీ, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా అభ్యర్థుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. 90145 50897, 99121 07709, 94910 41436 నెంబర్లలో అధికారులు అందుబాటులో ఉంటారు.



సమావేశంలో పాల్గొన్న జేసీ లావణ్యవేణి, అధికారులు

నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం : డీఎంహెచ్‌వో

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 23 : 'స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇటీవల ఫుడ్ పాయిజన్ వల్ల అనారోగ్యం పాలైన విద్యార్థుల ఆరోగ్యం ప్రస్తుతం మెరుగ్గా ఉంది. పాఠశాలలోనే వైద్య సిబ్బంది పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. మరో రెండు రోజుల్లో పూర్తిగా కోలుకుంటారని భావిస్తున్నాం'.. అని డీఎంహెచ్‌వో శర్మిష్ఠ తెలిపారు. శుక్రవారం ఆమె పాఠశాలను సందర్శించి ఇడ్లీ ప్లేట్లు, వంట చేసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి పీహెచ్‌సీని సందర్శించి వంకవారిగూడెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరయ్యారు. వైద్యాధికారి గాయిత్రి సిబ్బంది ఉన్నారు.



వేగవంతంగా దరఖాస్తుల పరిశీలన : కలెక్టర్



ఏలూరు సిటీ, ఫిబ్రవరి 23 : జిల్లాలో ఓటర్ల నమోదుకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా జరుగుతోందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. జిల్లా ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫారం-7 కు సంబంధించిన దరఖాస్తులను డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో మూడు బృందాలు పరిశీస్తున్నాయని, సప్లిమెంటరీ ఓటర్ల జాబితా ప్రకారం అదనపు పోలింగ్ స్టేషన్లకు అవసరమైన ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వకర్మ దరఖాస్తుల పరిశీలనకు కమిటీ

ఏలూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన దరఖాస్తులను ర్యాండమ్ పరిశీలన చేసి వారంరోజుల్లో నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల్లో వాస్తవికతను జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం, ఎల్‌డీఎం, డీఆర్‌డీఏ పీడీ తదితర అధికారుల బృందం పరిశీలించి మంజూరు కోసం నివేదిక సమర్పించాలన్నారు. జాలి పూడిలో సొమ్ములు వసూలు చేస్తున్నట్టు అందిన ఫిర్యాదుపై విచారణ చేయాలని ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్‌విండో పథకం ద్వారా 319 దరఖాస్తులు అందాయన్నారు. జేసీ బి.లావణ్యవేణి, పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

92 శాతం ఓటింగ్ నమోదయ్యేలా స్వీప్

ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి 92 శాతం నమోదయ్యేలా జిల్లాలో స్వీప్ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని డీపీవో, స్వీప్ జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. ఏలూరు కార్పొరేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం స్వీప్ కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా పట్టణ ఓటర్ల చైతన్య కార్యక్రమం నిర్వహించారు. అడిషినల్ కమిషనర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందితో ఏఎస్పీ సమీక్ష

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 : జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి ఆదేశించారు. జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లతో జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సిబ్బంది చేయాల్సిన పనులు, చేయకూడని పనులను వివరించారు. ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, జిల్లా న్యాయసలహాదారు కె.గోపాలకృష్ణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎన్.సుబ్బారావు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

29న ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 23 : భీమవరం వీరమ్మ పార్కు సెంటర్ అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 29న ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందరబాబు తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1989 ఎస్సీ, ఎస్టీ సవరణల చట్టం 2015, 2018- ఎస్సీ, ఎస్టీ రూల్స్, సంబంధిత జీవోలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పశ్చిమ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎస్పీ అజిత పాల్గొంటున్నారని తెలిపారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ, మాల మహానాడు ఉపాధ్యక్షుడు గొడి పెద్దిరాజు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సమ్మె విరమించిన కాంట్రాక్టు కార్మికులు

పెనుమంట్ర, ఫిబ్రవరి 23 : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మార్టేరు వరి పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం నుంచి తాత్కాలికంగా సమ్మె విరమణ చేశారు. ఈనెల 16 నుంచి 23 వరకు జరిగిన ఎనిమిది రోజుల ఆందోళనతో వ్యవసాయ విశ్వ విద్యాలయం యాజమాన్యం దిగొచ్చింది. సీఐటీయూ నాయకుడు కోడి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర డిమాండ్లే కాకుండా పరిశోధన స్థానంలో కాంట్రాక్టర్ నుంచి కార్మికులకు రావలసిన పే-స్లిప్పులు ఇవ్వడం లేదని, అధికారులు, కాంట్రాక్టర్, కార్మికులతో జాయింట్ మీటింగ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల డిమాండ్లు నెరవేర్చక పోతే రానున్న 20 రోజుల్లో ఏ సమయంలోనైనా సమ్మెకు వెళతారని తెలిపారు. దమ్ము నూకరత్నం, కట్టా శ్రీలక్ష్మి, బొంతు నాగలక్ష్మి, పిల్లి జగదీష్, కిరణ్ బాబు, నాగరాజు, ఇంజేటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



హాకీ జట్టుతో జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి ఆనందరాజు, కార్యదర్శి కట్రెడ్డి భరత్‌లు, హెచ్ఎం విజయ

జిల్లా హాకీ జట్టుకు అభినందనలు

భీమవరం రూరల్, ఫిబ్రవరి 23 : కర్నూలులోని మున్సిపల్ స్టేడియంలో జరిగిన 13వ సబ్ జూనియర్ హాకీ ఛాంపియన్‌షిప్-2024 పోటీలలో పశ్చిమ గోదావరి జిల్లా 3వ స్థానాన్ని కైవసం చేసుకుంది. శుక్రవారం అభినందన కార్యక్రమాన్ని భీమవరంలో నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కదలిదిండి ఆనందరాజు, కార్యదర్శి కట్రెడ్డి భరత్, సెంట్ మేరీస్ హెచ్ఎం విజయ, హాకీ ఆర్గనైజర్ నాగబాబు అభినందనలు తెలిపారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన బెంజాన్, దుర్గారావు, సురేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు.



ఉండి కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణలో మాట్లాడుతున్న మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త చారుమతి

దేశవాళీ వరి రకాలతో ప్రయోజనం

ఉండి, ఫిబ్రవరి 23: ప్రకతి వ్యవసాయ పద్ధతిలో దేశవాళీ వరి రకాలను ఉపయోగించినట్లయితే రైతులు ఆర్థికంగా లబ్ధి పొందవచ్చునని మార్టేరు వ్యవ సాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చారుమతి అన్నారు. శుక్రవారం ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున రావు మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని, పర్యావరణం కలుషితం తగ్గించి భూసారం పెంచాలని దీనివల్ల సాగు ఖర్చు తగ్గించుకుని ఆరోగ్య వంతమైన జీవనశైలిని గడపవచ్చని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజరు వై.నూకరాజు మాట్లాడుతూ రైతులు బయోకల్చర్‌ను విరివిగా ఉపయోగించడం ద్వారా పంటలలో పురుగులు, తెగుళ్లు సమర్థవంతంగా అరికట్టి సుస్థిర దిగుబడులు పొందవచ్చునన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వినయ లక్ష్మీ, డాక్టర్ రాజేష్‌లు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఉపయోగాలు వివరించారు. శాస్త్రవేత్తలు డిబోరా మెషియానా, రజిత, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి చేతుల మీదుగా పావనికి అవార్డు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 23: ఉన్నత విద్యను అభ్యసించిన మాజీ జడ్పీటీసీ బుసన బోయిన సత్యన్నారాయణ కుమార్తె పావని జాతీయస్థాయి పోటీల్లో నామినేషన్ పొందుపరచి ప్రతిష్టాత్మకమైన గ్రహంబెల్ అవార్డు అందుకుంది. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతులమీదుగా అవార్డు అందుకుంది ఈమె స్వస్థలం మండలంలోని దొరసానిపాడు. ఆధునిక సాంకేతికతను అనుసరించి సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగే విప్లవాత్మక మార్పులకు సంబంధించిన నూతన ఆవిష్కరణలకు గాను ఇటువంటి అవార్డులను 2010 నుంచి ప్రతీ ఏటా ప్రకటిస్తున్నారు.ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగంలో ఆమెకు అవార్డు లభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బ్రాండు గురూ!



అందుబాటులో మద్యం బ్రాండ్లు

ఎన్నికల వేళ మందు బాబులకు వల

పాలకొల్లు, ఫిబ్రవరి, 23 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సర్కారీ మద్యం దుకాణాల్లో మద్యపాన ప్రియులు మెచ్చే కొన్ని పాత బ్రాండ్లు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. బ్లెండర్‌స్ప్రైడ్, సిగ్నేచర్ వంటి విస్కీ రకాలు, మేన్సన్ హౌస్ వంటి బ్రాందీ రకాలు, టీచర్స్ 100 పైపర్ వంటి



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులోకి వచ్చిన బ్రాండ్లు

స్కాచ్ రకాలు మొన్నటి వరకూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అందుబాటులో లేవు. బ్రాండ్ మద్యం కావాలంటే అధిక ధరలు చెల్లించి బార్లలో కొనుగోలు చేసే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎన్నికల సమీపించడంతో మద్యపాన ప్రియులను ఆకట్టుకోవడానికి ప్రభుత్వ మద్యం మాల్స్‌లో వివిధ రకాల బ్రాండ్లను అందు బాటులోకి తెచ్చింది. మొన్నటివరకూ జగన్ రెడ్డికి ఆదా యాన్ని తెచ్చిపెట్టే జే బ్రాండ్స్ మాత్రమే అందుబాటులో ఉండగా ఇప్పుడు పలు రకాలు అమ్ముతున్నారు.

విసిగిపోయిన మద్యపాన ప్రియులు

వాస్తవానికి ప్రభుత్వంపై మందుబాబులు మండిపడుతున్నారు. మద్యం ధరలను మూడు రెట్లు పెంచేసినా తమకు నచ్చిన బ్రాండ్లు కొనుగోలు చేయ లేకపోతున్నామని వాపోతున్నారు.గత టీడీపీ ప్రభుత్వంలో రూ.50 ఉండే చీప్ లిక్కర్ రూ.150, మీడియం రేంజ్ బ్రాండ్లు రూ.500 నుంచి రూ.1500, స్కాచ్ బ్రాండు రూ.1500 నుంచి 3000లకు పెంచేశారు. మరో వైపు అధిక ధరలు చెల్లించినప్పటికీ తమకు కావాల్సిన బ్రాండు దొరక్క విలవిల్లాడారు. ధరలు పెంచడం, నిలకడ లేని బ్రాండ్లను సరఫరా చేయడంతో మద్యపాన ప్రియులు ప్రభుత్వం పట్ల ద్వేషాన్ని పెంచుకున్నారు. ఎన్నికల వేళ మద్యపాన ప్రియులను ప్రసన్నం చేసుకోవడానికే అన్నిరకాల బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగేళ్లలో జగన్‌ను ఆదర్శంగా తీసుకొని సమీప రాష్ట్రాలు మద్యం ధరలను పెంచేశాయి. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలలో కొన్న మద్యం బాటిల్ ధర రూ.400 ఉంటే నవ్యాంధ్రలో రూ.1500 లకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే విసుగుపోయిన మద్యపాన ప్రియుల్లో వ్యతిరేకత ఘననీయంగా పెరిగిందని సర్వేలలో తేలడంతో వారి ఓటు బ్యాంకును పోగొట్టుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అన్ని రకాలు బ్రాండ్లను వచ్చే నెల రోజుల్లో ప్రభుత్వ మద్యం మాల్స్‌లో ఉంచడానికి సంబంధిత శాఖకు సీఎం పేసీ నుంచి ఇప్పటికే ఆదేశాలు అందినట్లు సమాచారం.

నేత్రపర్వం..నారసింహుని గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 23: స్వయంభువమూర్తిగా సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో శుక్రవారం ఉదయం విశేష కార్యక్రమాలు జరిగాయి. పలువురు మహిళలు ప్రాణాచారాలను ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీరు కఠోరదీక్షతో దీన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం వైభవంగా జరిపారు. కొండపై ఆలయంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకి వాహనంలో ఉంచి దిగువకు తోడ్కొని వచ్చారు. ఆ తరువాత ఒక ప్రత్యేక వాహనంలో ఉంచి విశేష పుష్పాలంకరణ చేశారు. తరువాత గ్రామంలో ఊరేగించారు.



ప్రత్యేక అలంకారంలో ఊరేగుతున్న స్వామివారు..భక్తుల మొక్కులు

ఊరేగిన అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి



అంతర్వేది, ఫిబ్రవరి 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామి వారు రాజాధిరాజా వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగారు. అనంతరం అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గోవింద, నృసింహ నామస్మరణలతో భక్తుల నడుమ గ్రామోత్సవాలు ఘనంగా జరిపారు. రాత్రి 7.30 గంటలకు అశ్వవాహనంపై స్వామివారిని 16 మండపాల స్తంభం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చ కుల సమక్షంలో చోర సంవాద వేడుకలు నిర్వహించారు.దారి దోపిడీ దొంగకు, భగవంతుని మధ్య జరిగిన సంభాషణను అర్చకులు తమిళంలో చదివారు.

నేడు చక్రస్నానం

శనివారం ఉదయం శ్రీ స్వామివారికి చక్రస్నానం నిర్వహించనున్నారు. గరుడ పుష్పక వాహనంపై స్వామివారి ఆలయం వద్ద నుంచి సముద్రం వద్దకు బయలుదేరి అనంతరం చక్రవారి అవభ్రుథోత్సవం, సముద్ర స్నానం, వసంతమండపం వద్ద ప్రత్యేక పూజలు, అనంతరం ధ్వజాఅవరోహణ జరుగుతుంది. సముద్ర స్నానాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఈవో సత్యనారాయణ తెలిపారు.రాష్ట్రంలో మరెక్కడా లేనటువంటి ప్రాచీన సుదర్శన పెరుమాళ్ స్వామి వారిని మాఘమాసంలో పౌర్ణమి రోజున భక్తులు శిరస్సుపై ఉంచుకుని సముద్ర స్నానం చేయడం మోక్షప్రదం, ముక్తిదాయకమని ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం దేవస్థానం చెరువులో హంస వాహనంపై స్వామివారి తెప్పోత్సవం జరుగుతుంది.ఆలయ ఛైర్మన్ కలిదిండి కుమార రామ గోపాల రాజా బహదూర్, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కన్నుల పండువగా వాడపల్లి వెంకన్న కళ్యాణం

కవిటంలో ముగిసిన అతిరుద్ర మహాయాగం

పోడూరు, ఫిబ్రవరి, 23 : పోడూరు మండలం కవిటంలో 13 రోజులుగా అతిరుద్ర మహాయాగం మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆఖరి రోజు శుక్రవారం భక్తులు పోటెత్తారు. వేదపండితులు రుద్రహోమం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. 56 మంది ఋత్వికులచే 1,232 సార్లు రుద్ర పారాయణలు, ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. 25 మంది ఋత్వికులచే 84 సార్లు చండీ పారాయణం చేశారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భక్త జనసందోహం మధ్య కన్నుల పండువగా వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు.

శివాలయం పునఃనిర్మాణానికి కేంద్ర మంత్రి చొరవ



మాట్లాడుతున్న పేరుపాలెం గ్రామ పెద్దలు

మొగల్తూరు,ఫిబ్రవరి 23: పేరుపాలెంలో ఉన్న పురాతన ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయ పున నిర్మాణానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చొరవతో భూముల సర్వే పనులు జరుగుతున్నాయని ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ అందే ఫణీంద్రనాథ్, పలువురు గ్రామ పెద్దలు తెలిపారు. శుక్రవారం ఆయన పేరుపాలెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో 350 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన చెన్నప్రగడ వంశీయులు ఈ ఆలయం నిర్మించారన్నారు. ప్రస్తుతం ఆలయం జీర్ణోద్ధరణ స్థితికి చేరుకోవడంతో ఆలయ పునఃనిర్మాణానికి నాటి ఆలయ నిర్మాణ దాతల కుటుంబీకులు రూ.1కోటి విరాళం అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. ఇటీవల నరసాపురం పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి దృష్టికి ఆలయ విషయాన్ని తీసుకు వెళ్లగా సీజీఎఫ్ నుంచి నిధులు మంజూరు చేస్తారా అని రాష్ట్ర ఆర్థికమంత్రి రాజేంద్రనాథ్‌ని అడగగా అంగీకరించారన్నారు. మూడు రోజుల నుంచి మంత్రి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నట్టు వివరించారు.

నెల్లిపల్లవపాలెంలో వంతెన నిర్మాణం

తీర గ్రామాలైన పేరుపాలెం- ముత్యాలపల్లి గ్రామాలను కలుపుతూ నెల్లిపల్లవపాలెం వద్ద ఉప్పుటేరుపై వంతెన నిర్మాణానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. వంతెన లేకపోవడంతో ఉప్పుటేరులో పడవ దాటుతూ పలువురు మృతి చెందారు. వంతెన నిర్మిస్తే తీర గ్రామాలయిన పేరుపాలెం- కేపీ పాలెం గ్రామాల ప్రజలు ముత్యాలపల్లి మీదుగా 216 జాతీయ రహదారికి వెళ్ళేందుకు సులువు అవుతుందని గ్రామస్థులు తెలిపారు. సర్పంచ్ పేరుపాలెం వెంకన్న,మాజీ సర్పంచ్ మేళం బన్ను, చెన్నా ప్రగడ రామచంద్రరావు, శ్రీరామ చంద్రమూర్తి, కృష్ణమూర్తి, బాలాజీ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



గూటాల ఇసుక ర్యాంపులో ట్రాక్టర్లలోకి ఇసుక తోడుతున్న దృశ్యం

గూటాల నుంచి ఇసుక అక్రమ రవాణా

వైసీపీ నాయకుడి దందా

పోలవరం, ఫిబ్రవరి 23 : పోలవరం మండలంలో గూటాల ఇసుక ర్యాంపులో నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. స్థానిక వైసీపీ నాయకుని అండతో అతని కొడుకు ఇసుక అక్రమ రవాణా చేస్తూ అడ్డుకున్న వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పగటిపూట బోట్స్‌మెన్ బిల్లుతో ఇసుక అమ్మకాలు సాగిస్తూ ఒకే బిల్లుపై పలుమార్లు రవాణా చేస్తున్నారు. ఇసుక వాహనాన్ని ఆపి అడిగితే అప్పటికప్పుడు బిల్లుపై వాహనం నెంబరు వేస్తున్నారు.రాత్రి వేళ బిల్లులతో ప్రమేయం లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. స్థానిక నేత అండదండలతో ఇసుక రవాణా జరుగుతున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఏలూరు జిల్లా పరిధిలో అనుమతులు లేని ప్రతిమ కంపెనీ ఇసుక రవాణా అమ్మకాలు చేయడం సంబంధిత అధికారులు ఈ విష యంలో ఎలాంటి తనిఖీలు నిర్వహించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఈ విషయంపై మైనింగ్ అధికారి రవికుమార్‌ని వివరణ కోరగా ప్రతిమ కంపెనీకి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలలో అను మతులు లేవని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవలసి ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

భర్త వేధింపులతో ఆత్మహత్య



శిరీష (ఫైల్)

తణుకు, ఫిబ్రవరి 23: భర్త వేధింపులు తాళలేక మనస్తాపం చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పైడిపర్రులో జరిగింది. పోలీసులు అందించిన వివ రాల ప్రకారం అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన చింతపల్లి సత్య నారాయణకు, పైడిపర్రు డ్రైవర్స్ కాలనీకి చెందిన శిరీషకు 2019లో వివాహమైంది. అప్పటి నుంచి శిరీషను మానసికంగా, శారీరకంగా వేదిస్తుండటంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగు తు న్నాయి.ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం శిరీష పుట్టింటికి వచ్చేసింది. గురువారం సత్యనారాయణ భార్య ఇంటికి వచ్చి ఆమెకు ఘర్షణ పడి రెండేళ్ళ కుమారుడిని తనతో పాటు తీసికెళ్లిపోయాడు. శిరీషకు ఫోన్ చేసి ఇకపై కొడుకును తీసుకురానని చెప్పడంతో కలత చెందిన ఆమె మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసుల అదుపులో దోపిడీ దొంగలు

నల్లజర్ల, ఫిబ్రవరి 23: నల్లజర్ల మండలం పోతవరం షుగర్ ఫ్యాక్టరీ వద్ద దారి దోడిపీకి పాల్పడ్డ ఐదుగురు వ్యక్తుల్లో ముగ్గురు పోలీసులకు చిక్కారు. బుధవారం రాత్రి భీమవరం పట్టణానికి చెందిన నగల వ్యాపారి బాలు నాతు రామ్ కారును సిని ఫక్కీలో రెక్కీ నిర్వహించి ఐదుగురు వ్యక్తులు ఇన్నోవా కారులో వచ్చి ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులమని బెదిరించి వారి వద్ద 3.5 కిలోల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదుతో పారిపోయారు. దోపిడీకి పాల్పడ్డ ఐదుగురిలో ముగ్గురిని కొవ్వూరు డీఎస్పీ రామారావు తమ సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కొంతమంది బంగారు షాపుల్లో పనిచేసే వారి సమాచారంతో ఈ కుట్రకు పాల్పడినట్లు తెలుస్తోంది. దోపిడీ ముఠాకు సహకరించిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

ప్రేమ పేరుతో మోసం..ఒకరి అరెస్టు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 23 : ప్రేమ పేరుతో లోబర్చుకుని పెళ్లి చేసుకోమంటే ముఖం చాటేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు చెప్పారు.తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన యువతి భీమవరం పట్టణంలోని ఒక ప్రైవేటు కళాశాలలో బిఫార్మసీ చదువుతోంది. ఆకివీడు మండలం ఐ.భీమవరం గ్రామానికి చెందిన ఈదరపల్లి విజయ దుర్గాప్రసాద్ అదే కళాశాలలో ఎం.ఫార్మసీ చదువుతున్నాడు. ఏడాది కాలంగా ప్రేమిస్తున్నానంటూ ఆ యువతి వెంటపడి లోబర్చుకున్నాడు. పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే ముఖం చాటేయడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆ బ్యాగ్ పోతే ఉద్యోగం ఏమయ్యేదో !



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 23 : ఆటోలో బ్యాగ్ మర్చి పోవడంతో పోలీసులు ఆ బ్యాగ్‌ను యజమానికి అప్ప గించారు. కాకినాడకు చెందిన సామాల భాగ్యశ్రీ ఇటీవల ఎస్ఐ పోటీ పరీక్షల్లో విజేతగా నిలిచింది. ఆమెకు ట్రైనింగ్ నిమిత్తం ఏలూరు డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సి ఉంది. ఈనెల 22వ తేదీన తన తండ్రితో పాటు ఏలూరు వచ్చినవారు ఆటోలో బ్యాగ్ మర్చిపోయారు. బ్యాగ్‌లో సర్టిఫికెట్లు, అపా యింట్‌మెంట్ ఆర్డర్ ఉన్నాయి. ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది రంగంలోకి దిగారు. సీసీ కెమెరాల ఆధా రంగా ఆటోని గుర్తించి బ్యాగ్ అప్పగించారు.

కరకపాడు అడవుల్లోకి పులి

రెండు మేకలపై దాడి

గోపాలపురం మండల ప్రజల్లో భయం



పులి దాడిలో చనిపోయిన మేక

పోలవరం, ఫిబ్రవరి 23 : పాపి కొండల అభయారణ్యం నుంచి జనావాసాల్లోకి వచ్చిన పులి ప్రజానీకాన్ని భయపెడుతోంది. శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం కరకపాడు అడవిలో రెండు మేకలను చంపింది. రెండు రోజులుగా తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం తాళ్ళపూడి మండ లాల్లో సంచరించిన పులి శుక్రవారం నాటికి తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం కరకపాడు అడవుల్లోకి చేరుకున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. బుచ్చియ్య పాలెం గ్రామ రైతుకి చెందిన రెండు మేకలను చంపిందని తినకుండా అక్కడి నుంచి వెళ్ళి పోయిందనే సమాచారం అందడంతో సంఘటనా ప్రాంతానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు అటవీ క్షేత్రాధికారి దావీదు రాజు తెలిపారు. కరకపాడు,బుచ్చియ్యపాలెం, ఎల్ఎన్‌డీ పేట, రెడ్డిగూడెం, లక్ష్మీపురం, కొవ్వాడ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ఇప్పటి వరకూ మనుషులకు ఎలాంటి హాని చేయనప్పటికీ జనావాసాల్లో తిరగడం ప్రమాదకరమన్నారు. పులి భయంతో పొలాలకు, పాడి రైతులు పశువులను మేతకు తీసుకువెళ్ళడానికి భయభ్రాంతులకు గురవుతున్నామని అధికారులు త్వరిత గతిన చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



పట్టిసీమ వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

పట్టిసీమ ఉత్సవాలకు పటిష్ట భద్రత : ఎస్పీ

పోలవరం, ఫిబ్రవరి 23 : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగ కుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి పోలీసు అధికారులను ఆదేశించారు. మార్చి 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఎస్పీ పట్టిసీమలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేందుకు వీలుగా క్యూ లైన్లు, భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డీఎస్పీ ఎన్.సురేష్ కుమార్ రెడ్డి, సీఐ జి.మధుబాబు, ఎస్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టిసీమ ఉత్సవాల రెండో విడత సమీక్ష శనివారం సాయంత్రం 4 గంటలకు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

జగన్ అవకాశవాది

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహన్ రెడ్డి అవకాశ వాది అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ఉమ్మడి నాయకుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి అనుకూలంగానే వ్యవహరించారని, అయితే జగన్ ఎస్సీ వర్గీకరణకు కనీసం రాష్ట్రం నుంచి న్యాయవాదిని కూడా పెట్టలేదన్నారు. గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణ తన తండ్రి కల అని సానుకూలంగా మాట్లాడినా తరువాత పాదయాత్రలో కనీసం తమ వినతి పత్రాలు తీసుకోవడానికి కూడా అంగీకరించలేదన్నారు. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ సానుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆయన చొరవతోనే ఎస్సీ వర్గీకరణ విషయం సుప్రీం కోర్టులో తుది దశకు చేరుకుందన్నారు. తమకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని, మనమంతా బీజేపీకి అనుకూలంగా ఓటేయాలన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు ఏ పార్టీలో ఉన్నా అంతిమంగా ఓటు వేసే సమయంలో మాత్రం మన పిల్లలకు భవిష్యత్ అందించే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నవారి వైపే ఉండాలని సూచించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ రత్నరాజు, రాష్ట్ర నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, శెట్టి ఝాన్సీరాణి, ఎంఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెప్పుల వాసు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి రాజశేఖర్, యువసేన జిల్లా అధ్యక్షుడు గాలింకి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 23:సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధి కారులు, సంఘం నాయకులు శుక్రవారం ఆర్డీవో ఖాజావలీని జిల్లా అధ్యక్షుడు చంద్రమూర్తి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ 2008 నుంచి ఏపీపీపీ ఎస్సీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వీఆర్వోలుగా నియామకం పొందామని, డిగ్రీ పూర్తిచేసి రెవిన్యూ టెస్టులో సర్వే‌ట్రైనింగ్, ఇతర డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు పూర్తి అయ్యాయని, సీనియర్ అసిస్టెంట్ పదోన్నతి పొందేందుకు అవసరమైన అన్ని అర్హతలు కలిగి ఉన్న తాము గ్రేడ్ -1 వీఆర్వోలు చాలామంది ఉన్నామని తెలిపారు. సుమారు 15 ఏళ్ళుగా సర్వీస్ పూర్తి చేసుకున్నామని, నేటివరకు వీఆర్వోలకు పదోన్నతి తక్కువశాతంలో పొందామన్నారు. తక్షణం పదోన్న తులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు అధ్యక్షుడు సాయిల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

జీలుగుమిల్లి-పట్టిసీమ హైవే భూసేకరణ పనులు



రైతుల పట్టాలు పరిశీలిస్తున్న భూసేకరణ ప్రత్యేకాధికారి

పోలవరం ఫిబ్రవరి 23 : జీలుగుమిల్లి-పట్టిసీమ నేషనల్ హైవే నిర్మాణ భూసేకరణ కోసం రైతుల వివరాలను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయ తహసీల్దారు పోతురాజు పరిశీలించారు. నేషనల్ హైవే 365 బిబి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి 2023 ఫిబ్రవరిలో నివేదిక పంపామని ఈ ఏడాది జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం నుంచి బుట్టాయిగూడెం డిగ్రీ కాలేజీ వరకూ 40 కిలోమీటర్ల వరకూ బిల్లు ఆమోదం అయిందని తెలిపారు. జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకూ 67 కిలోమీటర్ల మేర నిర్మాణం జరగవలసి ఉంద న్నారు. ఎల్ఎన్‌డీ పేట నుంచి కన్నాపురం అడ్డరోడ్డు వరకూ భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం మండలంలో పట్టిసీమ, ఎల్ఎన్‌డీ పేట, వెంకటాయపాలెం గ్రామాలకు చెందిన 16 మంది రైతులకు నోటీసులు పంపామని 1.15 ఎకరాల భూమి సేకరణకు రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మరో 1.90 ఎకరాల భూమికి నోటిఫికేషన్ ఇవ్వవలసి ఉందన్నారు. పోలవరం మండల వైసీపీ కన్వీనర్ బుగ్గా మురళీ కృష్ణ రైతుల భూములకు తగిన రీతిలో పరిహారం ఇప్పించాలని, పోలవరం మండంలో పోలవరం ప్రాజెక్టులో 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణం కోసం రైతులకు సమాచారం ఇవ్వకుండా వారి పంట పొలాల్లో ఇష్టారాజ్యంగా విద్యుత్ టవర్లు నిర్మిస్తున్నారని ప్రభుత్వం భూ సేకరణ విషయంలో వారికి సమాచారం తెలిపి తగు న్యాయం చేయాలని కోరారు.

ఎత్తిపోతల పథకం నిర్వాసితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చింతలపూడి, ఫిబ్రవరి 23: చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో నిర్వాసిత రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. చింతలపూడిలో నిర్వాసిత రైతుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చి ఐదేళ్లలోపు ఆ భూముల్లో ఎటువంటి పనులు నిర్వహించకపోతే తిరిగి రైతులకు అప్పగించాలన్నారు. 2015-16లో నోటిఫికేషన్ ఇచ్చారని, ఏడేళ్లు దాటుతున్నా రైతులకు పరిహారం ఇవ్వలేదని, నోటిఫికేషన్ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇచ్చి మార్కెట్ విలువ ప్రకారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం తరహాలో రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జగన్‌రెడ్డి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. భూములను రెవెన్యూ రికార్డుల్లో బ్లాక్‌లిస్టులో పెట్టడంతో ప్రభుత్వ పథకాలు పొందలేక, పంట రుణాలు రాక, భూమి ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రైతులంతా ఉద్యమానికి సన్నద్ధంకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పోరాట కమిటీ అధ్యక్షులు ఖాదర్‌బాబు రెడ్డి, కార్యదర్శి చిట్లూరి అంజిబాబు, గోలి రామకృష్ణారెడ్డి, అంజిబాబు, చిలుకూరి శ్రీహరిరెడ్డి, వనమాల రాంబాబు, కొనకళ్ళ కృష్ణమూర్తి, కుమార్, బాబూరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు కృషి : తపనా చౌదరి



ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న తపనా చౌదరి

ఉంగుటూరు, ఫిబ్రవరి 23: నారాయణపురం, కొల్లేరు ప్రజల తాగునీటి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తామని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి తెలిపారు. నారాయణపురంలో రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. 2008 నుంచి తమ సంస్థ పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిడ్ల అలకనంద, నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి, నగరపాటి సత్యనారాయణ, అడపా శోభారాణి, వంజరపు దుర్గారావు పాల్గొన్నారు.

భీమడోలు హైస్కూల్‌లో డీఈవో తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

భీమడోలు, ఫిబ్రవరి 23: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో డీఈవో ఎస్ అబ్రహం శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 9వ తరగతి విద్యార్థులను లెక్కలు, భౌతిక శాస్త్రం పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థుల కార్యాచరణ ప్రణాళిక, గత ఏడాది పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలు వారికి వచ్చిన మార్కులను అడిగి తెలుసుకున్నారు. భీమడోలు ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యాంశాలు, నోట్స్, సిలబస్‌పై ప్రశ్నించారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌ననే ఆరోపణలు : నవ్య

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23: స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన తాను అనుక్షణం గ్రామాభివృద్ధికి కృషిచేస్తుంటే కొందరు తప్పుడు ఫిర్యాదులతో ఇబ్బంది పెడుతున్నారని జాలిపూడి సర్పంచ్ వీధి నవ్య ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విశ్వకర్మ యోజన దరఖాస్తులు తీసుకునేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నానని కొందరు మహిళలు ఫిర్యాదు చేయటం ఆవేదన కలిగించిందన్నారు. తాను సర్పంచ్‌గా ఎటువంటి అవినీతికి పాల్పడలేదని నవ్య అన్నారు.

లలితా సహస్ర నామ కోటి కుంకుమార్చన



రామకోటి కళావేదికపై కోటి కుంకుమార్చన

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 23: అగ్రహారంలోని రామకోటి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం లలితా సహస్ర నామ కోటి కుంకుమార్చన నిర్వహించారు. 310 మంది మహిళలు సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. కోటి కుంకుమార్చన 24, 25 తేదీల్లో కూడా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు కొట్టు మధు వెంకట్రావు, వి.సురేష్‌కుమార్, మానేపల్లి రామారావు, పాదర్తి బాలకృష్ణ ఏర్పాట్లు చేశారు.

సామూహిక శ్రీచక్ర కుంకుమార్చన

అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ శ్రీచక్ర కుంకుమార్చన జరిపించారు. తొలుత అమ్మవారికి పంచామృతాభిషేకం అనంతరం విశేష అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. బావిశెట్టివారిపేట కనకదుర్గాంబకు అభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం



రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 23: తూర్పువీధిలో రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అర్చకులు వేదాంతం రామానుజాచార్యులు, కనిగొళ్ళ సురేష్ భక్తులతో పూజలు చేయించారు. భక్తులతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది.

నేడు గాలాయగూడెంలో నిప్పుల గుండం



దెందులూరు, ఫిబ్రవరి 23: గాలాయిగూడెం అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 9 రోజులలో లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా. శనివారం ఆలయం వద్ద నిప్పుల గుండం నిర్వహించనున్నారు. సంతాన లేమితో బాధపడుతున్న వారు నిప్పుల గుండం తొక్కితే పిల్లలు పుడతారని భక్తుల విశ్వాసం, భర్త దీర్ఘాయుషు కోసం పలువురు భక్తులు నిప్పుల గుండం తొక్కుతారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి రానుండడంతో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణోత్సవం



ఆలయం వద్ద భక్తుల సందడి

కామవరపుకోట, ఫిబ్రవరి 23: భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అక్కయ్యశర్మ, మేడూరి ప్రసాద్, అర్చకులు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయం వద్ద వీరంగ నృత్య నాటకాలు ప్రదర్శించారు. ఆర్యవైశ్య సంఘం, తేలీల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని వేదిక వద్ద శివలింగానికి పంచ హారతులు ఇచ్చారు.

నూకాలమ్మకు బంగారు మంగళ సూత్రాలు



బంగారు సూత్రాలను బహూకరిస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 23: నూకాలమ్మకు దాతలు బంగారు మంగళ సూత్రాలను బహూకరించారు. అమ్మవారు శుక్రవారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కల్యాణ కళావేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీజలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి పెన్మత్స రాజంరాజు, నాగలక్ష్మి దంపతులు సుమారు ఎనిమిది గ్రాముల బంగారు సూత్రాలు సమర్పించారు. అమ్మ వారి రజత వస్త్రం తయారీకి గుండ సత్యనారాయణ, స్వాతి దంపతులు (చిలకలూరిపేట) 10 తులాల వెండి, అల్లూరి నాగ వర్మరాజు శిరీష దంపతులు 10 తులాల వెండి సమర్పించారు. దాతలకు ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.



పాత బస్టాండ్ వద్ద ఆటో, క్యాబ్ డ్రైవర్ల రిలే దీక్ష



ఉపాధి పనులు కల్పించాలని ఏలూరులో ధర్నా



చింతలపూడిలో వామపక్షాల నిరసన ప్రదర్శన



కొయ్యలగూడెంలో సీపీఐ నాయకుల నిరసన

నిరసన హోరు

ఉపాధి హామీ పనుల కోసం కూలీల ధర్నా

ఈ-చలానా రద్దు చేయాలని ఆటో డ్రైవర్ల రిలే దీక్ష

ఢిల్లీలో రైతులపై కాల్పులు.. వామపక్షాల బ్లాక్ డే

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23: ఏలూరు చుట్టుపక్కల ఏడు గ్రామ పంచాయతీలను నగరంలో విలీనం చేయడంతో పేదలకు ఉపాధి కరువైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.రామకృష్ణ విమర్శించారు. ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని నినాదాలు చేశారు. విలీనంతో పేద కుటుంబాలు, దళితులు, వ్యవసాయ కుటుంబాలు ఉపాధి లేకుండా పోయిందన్నారు. కోమంగిలో సుమారు 1400 జాబ్‌కార్డులు రద్దు కాగా ఉపాధి పనులు లేక పేదలు, కూలీలు అవస్థలు పడుతున్నారని, తక్షణం ఉపాధిహామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. జి.దుర్గ, లక్ష్మణ్, జె.పాప, బి.నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈ-చలానాలను రద్దు చేయాలి

ఆటో, క్యాబ్ వాహనాలపై విధించిన ఈ-చలానాను రద్దుచేయాలని, అసవ్యస్తంగా ఏర్పాటుచేసిన స్టాప్‌లైన్, సీసీ కెమెరాలను నిలిపివేయాలని ఆలిండియా రోడ్డుట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదఫర్ అహ్మద్, జిల్లా కార్యదర్శి జె.గోపి డిమాండ్ చేశారు. ఈ చలానా రద్దుచేయాలంటూ పాత బస్టాండ్ వద్ద రెండో రోజు దీక్షలు కొనసాగించారు. సీసీ కెమెరాలు నేరస్థులను గుర్తించడానికి ఉపయోగపడాలే కాని, ప్రజలపై భారాలు మోపేందుకు కాదని వీటిని వెంటనే నిలిపివేసి ఈ చలానాలు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, టీఎస్ ప్రసాద్, పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ క్రూరత్వానికి యువ రైతు బలి

చింతలపూడి: హర్యానాలో బీజేపీ ప్రభుత్వ క్రూరత్వానికి యువ రైతు శుభకరణ్‌సింగ్ బలికావడం బాధాకరమని అఖిలపక్ష రైతు సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. రైతులు నల్లరిబ్బన్లు ధరించి నల్ల జెండాలతో నిరసన తెలిపారు. సీపీఐ సీనియర్ నాయకులు ఎం.వసంతరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సోమశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.కృష్ణ మాట్లాడుతూ యువ రైతు మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ రక్తసిక్తం కావడానికి కేంద్రంతో పాటు హర్యానా ప్రభుత్వం కారణమని ఆరోపించారు. కనీస మద్దతు ధర కోసం రైతులు పోరాడుతుంటే వారిపై బుల్లెట్‌లు, బాష్పాయువు ప్రయోగించడం ఎంతవరకు న్యాయమన్నారు. నిరసన ప్రదర్శనలో సీపీఎం నాయకులు ఆర్.వి.సత్యనారాయణ, కంచర్ల గురవయ్య, నత్తా వెంకటేశ్వరరావు, బాలరాజు, టి.బాబు, జె.రామచంద్రారెడ్డి, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో కార్మిక సంఘాల నిరసన ప్రదర్శన

● ఏలూరు రూరల్: ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళనపై మోదీ ప్రభుత్వం, హర్యానా బీజేపీ ప్రభుత్వం, అమానుష పోలీసు దాడుల్లో యువరైతు మరణించడంపై కార్మికసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్‌డే నిర్వహించారు. ఫైర్‌స్టేషన్ సెంటర్లో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్‌డే నిర్వహించారు. రెడ్డి శ్రీనివాస్‌గాంగే, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సోమయ్య మాట్లాడారు. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, విద్యుత్ సంస్కరణ బిల్లులు రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఢిల్లీలో రైతులు ఆందోళన చేస్తుంటే పోలీసులు దాడులు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. దాడులకు పూనుకోవడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గౌరవఅధ్యక్షుడు కృష్ణమాచార్యులు, బి.జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, పి.కిషోర్, పి.కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: కేంద్ర ప్రభుత్వం రైతులపై కర్కశంగా వ్యవహరిస్తుందని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాస్ విమర్శించారు. ముఠా కార్మికులతో కలసి నల్లరిబ్బన్లతో నిరసన వ్యక్తం చేశారు. రైతుల ఉద్యమాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తుందన్నారు. బలగాలతో రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలగా నాని, గుదే శ్రీను, ఇళ్ళ నర్సయ్య, మట్టా రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



బాదంపూడిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న గన్ని



ఏలూరులో ప్రజా సంకల్ప యాత్రలో బడేటి చంటి

రాష్ట్రంలో పేదలకు రక్షణ లేదు : గన్ని

ఉంగుటూరు, ఫిబ్రవరి 23: రాష్ట్రంలో అరాచక పాలనతో పేదల రక్షణ కరవైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. మండలంలోని బాదంపూడిలో శుక్రవారం మన ఇంటికి మన గన్ని కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసిన సీఎం విమర్శలు చేయడం తప్ప, పేదలకు తగిన న్యాయం జరగడం లేదన్నారు. కాగుపాడు నుంచి కడియాల రవిశంకర్ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మొగలపు సుభాష్, వంకిన వెంకటేశ్వరరావు, జామి రాంబాబు, దూలపల్లి సత్యనారాయణ, ముళ్లపూడి అయోధ్యరామయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: రానున్న రెండునెలల్లో పేదల జీవితాల్లో వెలుగులు వస్తాయని, టీడీపీ, జనసేన ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ రాజ్యాన్ని అందిస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి భరోసా ఇచ్చారు. శుక్రవారం శాంతినగర్ 7వ రోడ్డులో ప్రజా సంకల్పయాత్ర నిర్వహించారు. టీడీపీ, జనసేన అమలుచేసే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పత్రికారంగంపై వైసీపీ దాడులు పిరికిపంద చర్య అన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు, ఎ.రామకృష్ణ, కేతినీడి భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగు మేలు



అంకన్నగూడెంలో పండించిన కూరగాయలు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 23: ప్రకృతి వ్యవసాయ విధానం జడ్‌బీఎన్ఎఫ్ (జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) ద్వారా కూరగాయలు 365 రోజులు పండించవచ్చని మాస్టర్ ట్రైనర్ ధర్మరాజు అన్నారు. అంకన్నగూడెంలో ఈ విధానంలో సాగు చేసిన కూరగాయలను శుక్రవారం పరిశీలించారు. వీటిని పండించటం ఆరోగ్యంతోపాటు రైతుకు అమ్మకం ద్వారా ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంటీఎల్ దినేష్‌కుమార్, ఎన్ఎఫ్ఎ మధు, ఎస్‌డీఎ నాగేశ్వరావు, ఐసీఆర్‌పీలు ఉన్నారు.

చానమిల్లిలో అభివృద్ధి కార్యక్రమాలు



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

నిడమర్రు, ఫిబ్రవరి 23: గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వ పథకాలు సత్వరం అందజేయడానికి సచివాలయాలను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. చానమిల్లిలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. సీసీ డ్రెయిన్లు, హెల్త్‌క్లినిక్, కాలనీ రోడ్లు, సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే వాసుబాబు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. వ్యవసాయ మండలి జిల్లా చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు. ఎంపీపీ ధనకొండ ఆదిలక్ష్మి, జడ్పీటీసీ కోడే కాశీ, సర్పంచ్ ప్రసాద్, ఉప సర్పంచ్ వెజ్జు నరేష్, వెజ్జు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవనంలో కస్తూరిబా వర్ధంతి



కస్తూరి బా వర్ధంతి కార్యక్రమం

నిడమర్రు, ఫిబ్రవరి 23: స్వాతంత్ర పోరాటంలో జాతిపిత గాంధీకి అండగా నిలిచిన కస్తూరిబా గాంధీ సేవలను ప్రతిఒక్కరూ మననం చేసుకోవాలని జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. పెదనింద్రకొలను గాంధీ భవనంలో గాంధీజీ సతీమణి కస్తూరిబా గాంధీ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. గాంధీ స్మారక నిధి కార్యనిర్వాహక సభ్యుడు ఎస్.బాపిరాజు రూ.2.5 లక్షలు సర్వోదయ మండలి సభ్యులకు అందజేశారు. సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు సాగిరాజు జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

49 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు



తహసీల్దార్, ఎంపీడీవో పరిశీలన

కామవరపుకోట, ఫిబ్రవరి 23 : సార్వత్రిక ఎన్నికలకు మండలంలో 49 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ కె.శేషగిరిరావు, ఎంపీడీవో జంగం స్వర్ణభారతి తెలిపారు. పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తామన్నారు. ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకునే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం, వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ప్రవేశ మార్గం, పకడ్బందీగా పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకున్నామన్నారు. వారి వెంట గుంటుపల్లి కార్యదర్శి రత్నకుమారి, తదితరులు ఉన్నారు.

కొవ్వలి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలన

దెందులూరు, ఫిబ్రవరి 23: విద్యార్థులకు నాణ్యతతో భోజనం అందించాలని జిల్లా సమగ్ర శిక్షణ ప్రాజెక్టు అదనపు కోఆర్డినేటర్ సోమశేఖర్ అన్నారు. కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో గోరు ముద్ద అమలును శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, పాలు, పిల్లలకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. భోజనం అమలుపై విద్యార్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం శర్మతో కలిసి మరుగుదొడ్లు, ల్యాబ్ గ్రంథాలయం, తరగతి గదులను పరిశీలించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23: దోమలు మానవాళికి ప్రధాన శత్రువులని, దోమల నిర్మూలన ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. గజ్జలవారి చెరువు వైద్యాధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గోవిందరావు మాట్లాడుతూ దోమలతో ప్రాణాంతక డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాపిస్తాయని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, గంగాభవాని, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

50మందికి కుట్టుమిషన్లు పంపిణీ

పెదవేగి, ఫిబ్రవరి 23: ఎస్ఎంసీ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ సహకారంతో 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లను పంపిణీ చేశారు. హైస్కూల్ చైర్మన్ ఫాదర్ చుక్కా డోమ్నిక్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ ఎస్ఎంసీ హైస్కూల్ వేదికగా మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ తీసుకున్న మహిళలకు లయన్స్‌క్లబ్ ఆర్థిక సాయంతో కుట్టు మిషన్లు అందిస్తున్నామని చెప్పారు. డోమ్నిక్ జన్మదినం సందర్భంగా 20మంది పేదలకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్.పావని, సీహెచ్.అవినాష్‌రాజు, శేషుకుమార్, ఫాదర్ జయరాజు, శ్రీనివాసరావు, విష్ణు, పౌలు, విజయబాబు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన కూటమి విజయానికి కృషి : రోషన్



విలేకరుల సమావేశంలో రోషన్‌కుమార్

కామవరపుకోట, ఫిబ్రవరి 23 : రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయానికి అందరం కలిసి పనిచేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పాతూరులో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ నివాసం వద్ద శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఐక్యంగా పనిచేస్తే విజయం ఖాయమంటూ స్పష్టం చేశారు. ఆయన వెంట పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులను రోషన్ కుమార్ కలుసుకున్నారు. రామన్నపాలెంలో టీడీపీ జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, కోనేరు వెంకట సుబ్బారావు, జనసేన మండల కన్వీనర్ షేక్ వలీ, తదితరులతో కొద్దిసేపు చర్చించారు. నాయకులు, కార్యకర్తలు తమకు అండగా ఉండాలని, తాను అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు.

మాగంటిని కలిసిన రోషన్‌కుమార్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23: టీడీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం మాజీ ఎంపీ మాగంటిబాబును మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. చింతలపూడి నియోజకవర్గ టీడీపీ నాయకులు తదితరులు ఆయనతో ఉన్నారు.

చేబ్రోలులో జనంలోకి జనసేన



సమస్యలు తెలుసుకుంటున్న ధర్మరాజు

ఉంగుటూరు, ఫిబ్రవరి 23: టీడీపీ, జనసేన కూటమిని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. మండలంలోని చేబ్రోలులో శుక్రవారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఆయన వెంట నగరపాటి ఫణీంద్ర కుమార్, ఆకుల సతీష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఓపీఎస్‌పై పుస్తకావిష్కరణ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 23: నూతన పింఛన్ విధానంపై యూటీఎఫ్ పోరాటం కొనసాగిస్తోంది. పాత పింఛన్ అమలుకు హామీ ఇచ్చిన పార్టీలకు ఎన్నికల్లో మద్దతు ఇవ్వనుంది. ఎన్నికల్లో గెలవడం కోసం కొన్ని రాజకీయ పార్టీలు పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని వాగ్దానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో రాజకీయ ఎజెండాగా పాత పెన్షన్ విధానం కోసం యూటీఎఫ్ ఓట్‌ఫర్ ఓపీఎస్ నినాదం తీసుకుంది. దీనికి సంబంధించి శుక్రవారం పుస్తకావిష్కరణ జరిగింది. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముస్తాఫ్ ఆలీ తదితరులు మాట్లాడారు. పాత పెన్షన్ పునరుద్ధరణ మేనిఫెస్టోలో చేరుస్తామని పార్టీలు చెప్పాలన్నారు. ఎన్నికల తరువాత పాత పెన్షన్ పునరుద్ధరిస్తూ మొదటి సంతకం చేస్తామని స్పష్టత ఇచ్చే పార్టీల వైపు యూటీఎఫ్ కార్యాచరణ ఉండబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి పీవీనరసింహారావు, జీవీ రంగమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోమవరప్పాడులో గడ్డివాము దగ్ధం

దెందులూరు, ఫిబ్రవరి 23: సోమవరప్పాడులో గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టడంతో గడ్డి వాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన చల్లపల్లి నాగేంద్ర కుమారుడు చల్లపల్లి అమర్నాథ్ చౌదరికి చెందిన గడ్డి వాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు రేగడం గమనించి బాధిత రైతు అమర్‌నాథ్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు మంటలను అదుపు చేశారు. అప్పటికే రూ.1.5 లక్షల విలువైన గడ్డి వాము దగ్ధమైంది. తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

సంక్షిప్త సమాచారం..

- **చింతలపూడి :** పాత చింతలపూడి గ్రామానికి చెందిన మద్దా ఉష కుటుంబానికి రాజీవ్ థామస్ ట్రస్ట్ తరఫున కుట్టు మిషన్ అందజేశారు. టీడీపీ నాయకులు థామస్, నాగభూషణం మాట్లాడుతూ మద్దా ఉష కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సహాయం అందించిందని, తెలుగుదేశం పార్టీ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో నాయకులు ముందుంటారని పేర్కొన్నారు. అనీష్‌కుమార్, నలమాటి రామకృష్ణ, వాసు, యేబు తదితరులు పాల్గొన్నారు.
- **భీమడోలు :** పూళ్ళ గ్రామంలోని మూడు నిరుపేద కుటుంబాలకు ప్రమాదంలో గాయపడి రెండు కాళ్ళు కోల్పోయి చికిత్స పొందుతున్న ఒకరికి, వడ్లపట్లలో మరో రెండు కుటుంబాలకు మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ నిత్యావసర సరుకులు, కొత్త వస్త్రాలు, 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. చైర్మన్ నూకరాజు, అధ్యక్షుడు సుగుణాకర్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** సారా విక్రయాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.జయకుమార్ తెలిపారు. మెట్టగూడెంలో సారా విక్రయాలు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. సారా విక్రయిస్తున్న వ్యక్తి పారిపోయాడు. 9 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.
- **ఉంగుటూరు :** కైకరం కాల్వ గట్టు వద్ద చిన కంబాలమ్మ ఆలయ వార్షికోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.
- **లింగపాలెం :** మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులను ప్రదానం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వలంటీర్లు వారధిగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టా సురేష్, కొటారు మోహన్‌రావు, కంభం విజయరాజు, ముసునూరి వెంకటేశ్వరరావు, పలువురు అధికారులు, నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.







కొయ్యలగూడెం, ఉంగుటూరు మండలం కైకరం, జంగారెడ్డిగూడెంలో ఎర్రన్నాయుడు చిత్రపటాలు, విగ్రహం వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తల నివాళి

ఘనంగా ఎర్రన్నాయుడి జయంతి

టీడీపీ నేతల నివాళి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 23: దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజారపు ఎర్రన్నాయుడు జయంతి ఘనంగా నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఎర్రన్నాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ, టీడీపీ జిల్లా కార్యదర్శి శ్రీను, రౌతు శ్రీను, బలుసు నాగేశ్వరరావు, రాంబాబు, అన్నవరం, మలిశెట్టి కేసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: టీడీపీ పట్టణ కార్యాలయంలో రావూరి కృష్ణ, రాజాన సత్యనారాయణ అధ్యక్షతన ఎర్రన్నాయుడు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా ఆసుపత్రిలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజుపాల్ కుమార్, చిట్రోజు తాతాజీ, కరుటూరి రమాదేవి, గుళ్లపూడి శ్రీదేవి, అబ్బిన దత్తాత్రేయ, పెసరగంటి జయరాజు, అల్లూరి రామకృష్ణ, చేను ప్రసాద్, కాసాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాండ్ర పాపారాయుడు విగ్రహం దగ్గర ఎర్రన్నాయుడు జయంతి నిర్వహించారు. రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ కుగ్రామం నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగిన నేత ఎర్రన్న అని కొనియాడారు. ఎర్రన్న ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. సంఘం అధ్యక్షుడు భీమిరెడ్డి జోగిబాబు, బంగారు శ్రీను, రొంగల దేవీప్రసాద్, పైల చంటి, గోట్టాపు రామారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎనలేని సేవలందించిన కింజరాపు ఎర్రన్నాయుడు చిరస్మరణీయుడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. కైకరం ఎన్టీఆర్ చౌక్‌లోని ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సలగాల గోపి, చింతల శ్రీనివాస్, సిరిబత్తుల కృష్ణమోహన్, చిప్పాడ రాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద పడి ఉన్న తడి, పొడి చెత్త డబ్బాలు

ఆలోచనలు ఘనం.. ఆచరణ శూన్యం

పారిశుధ్య నిర్వహణపై నూజివీడు మున్సిపల్ అధికారుల ఆలోచనలు ఘనం. ఆచరణ శూన్యమనేందుకు ఈ చిత్రాలే తార్కాణం. నూజివీడు మున్సిపల్ కార్యాలయంలోకి వచ్చే ప్రజలు చేతులు కడుక్కొని రావడం, వెళ్ళడం చేసేందుకు వీలుగా ముస్సిపల్ ప్రధాన కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యం జగనన్న ప్రభుత్వ లక్ష్యం, సబ్బుతో చేతుల శుభ్రత, ఆరోగ్య జీవితానికి భద్రత అంటూ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. వాటర్ ట్యాంకును అయితే ఏర్పాటు చేశారు కాని, అందులో నీటిని నింపడం మాత్రం మరిచి పోయారు. శుక్రవారం ఈ వాటర్ ట్యాంకును ఆంధ్రజ్యోతి పరిశీలించగా నీరు లేక, వాడకం లేక దుమ్ము, ధూళితో ఇదిగో ఇలా వాటర్ ట్యాంక్ దర్శనమిచ్చింది. మరోవైపు పట్టణంలో ప్రధాన కూడళ్ళల్లో తడి, పొడి చెత్త నిర్వహణకు ఏర్పాటు చేయతలపెట్టిన చెత్తకుండీలు ఇలా మున్సిపల్ కార్యాలయంలోనే గత కొద్దికాలంగా పడి ఉండడం గమనార్హం.

-నూజివీడు టౌన్



చుక్క నీరులేని వాటర్ ట్యాంకు

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో మినుము రైతులు

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 23: వాతావరణం రెండురోజులుగా మబ్బుగా ఉండడంతో మినుము రైతులు ఆందోళన చెందుతున్నారు. మబ్బుల కారణంగా పురుగు ఉధృతి అధికమయ్యే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటివరకు వాతావరణం మినుము పైరుకు అనుకూలంగా ఉందని ఈ దశలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఆలస్యంగా చల్లిన మినుము పైరులో అక్కడక్కడ పురుగు ఉందని మందులు పిచికారీ చేస్తున్నా మబ్బులు కారణంగా పురుగు ఉధృతి తగ్గే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే వరి సాగులో తీవ్రంగా నష్టాల పాలైన రైతులకు రెండో పంట మినుము పైరుపై పూర్తి ఆశలతో ఉన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు మినుము పైరుపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.



ఏపుగా ఉన్న మినుము పైరు

ఆధ్యాత్మికం

నేడు నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముసునూరు, ఫిబ్రవరి 23: గోపవరంలో పునః నిర్మించిన ఆలయంలో నాగేంద్రస్వామి విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఉదయం 11.46 గంటలకు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం యాగశాల ప్రదక్షణ, పాలభిషేకం, వాస్తుపూజ, వాస్తుహోమం, మధ్యాహ్నం గ్రామప్రదక్షణ, సాయంత్రం స్వామివారికి జలాదివాసం, జలశుద్ధి, ధాన్యాదివాసం, యాగశాల అర్చన, శాంతి హోమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.



వైభవంగా రుద్రహోమం

కైకలూరు, ఫిబ్రవరి 23: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న రామేశ్వర, రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రుద్రహోమం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవను వైభవంగా నిర్వహించారు. న్యాయవాదులు గొర్తి ప్రభాకర దీక్షితులు, గురజాడ ఉదయశంకర్ దంపతులు రుద్రహోమాలను వైభవంగా నిర్వహించారు. యాజ్ఞికుడు పావని మురళీకృష్ణ ఆధ్వర్యంలో రుద్రహోమం పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం పవళింపు సేవలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ చైర్మన్లు బూరుబోయిన మోహనరావు, గుర్రం రాంబాబు, ఈవో వీఎస్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించి భక్తులకు ఉచిత ప్రసాదాన్ని అందజేశారు.



ఘనంగా వీరాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ

చాట్రాయి, ఫిబ్రవరి 23: మండలంలోని సూరంపాలెం వీరాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, బీజేపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి తపన చౌదరి సతీమణి రేణుక ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్త బృందం హనుమాన్ చాలీసా పారాయణం చేసింది. అనంతం భారీ అన్నసమారాధన జరిగింది.



సూరంపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో చాలీసా పారాయణ

భోగేశ్వరస్వామి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

కలిదిండి, ఫిబ్రవరి 23 : కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. ఆవరణలో తాటాకులతో చలువ పందిళ్లు వేస్తున్నారు. మరో పక్క ప్రాకార మండపం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భక్తులు పుణ్య స్నానమాచరించే పంచబుగ్గల కోనేరులో నిల్వ నీటిని బయటకు తోడేశారు. కోనేరులో బురద మట్టి ఎండిన తర్వాత స్వచ్ఛ నీరు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. తపస్సు చెరువును శుభ్రపర్చారు. ఆవరణలోని తుప్పలు తొలగించి ట్రాక్టర్లతో చదును చేశారు. మార్చి 5వ తేదీ కల్లా స్వామివారి ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణోత్సవం

కామవరపుకోట, ఫిబ్రవరి 23: భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కు అక్కయ్యశర్మ, మేడూరి ప్రసాద్, అర్చకులు అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం, తేలీల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని వేదిక వద్ద శివలింగానికి పంచ హారతులు ఇచ్చారు.

ఎస్సీలపై దొరగారికి చిన్నచూపు

- సీఎం జగన్‌కు బటన్ నొక్కుడు తప్ప మరేం తెలీదు
- టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో కొలుసు పార్థసారథి
- కైకలూరులో టీడీపీ నాయకుల బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ
- పెదగొన్నూరులో టీడీపీ-జనసేన శంఖారావం



నూజివీడులో ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొన్న పార్థసారథి

నూజివీడు, ఫిబ్రవరి 23: ఎస్సీల పట్ల నూజివీడు దొరగారికి చిన్నచూపని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులకు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి రిజర్వ్ అయినా నాలుగున్నరేళ్లుగా ఆ పదవి భర్తీ చేసి తన పక్కన కూర్చోబెట్టుకోకుండా నూజివీడు దొరగారైన శాసనసభ్యుడు వివక్ష చూపుతున్నాడన్నారు. అభివృద్ధిని చూపలేక ప్రజలను మభ్యపెట్టడానికి స్థానికతను తెరపైకి తెస్తున్నాడని, పెనమలూరు శాసనసభ్యుడిగా ఉన్న తాను అక్కడ స్థానికుడిని కాదని, అయినా అక్కడ గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నడిపానన్నారు. టిడ్కో లబ్ధిదారులకు జగన్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. లబ్ధిదారుల పేరుతో రుణాలు తీసుకున్న రాష్ట్రప్రభుత్వం చర్యల వల్ల లబ్ధిదారులు అద్దె ఇళ్ళల్లో అద్దె కట్టుకోలేక ఇటు తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జగన్‌కు అభివృద్ధి అంటే బటన్ నొక్కడమే తప్ప ఇంకేమీ తెలియదన్నారు. మేనిఫెస్టో అమలు చేశానని చెబుతున్న జగన్‌రెడ్డి తన మేనిఫెస్టోలోనే చెప్పిన మద్యనిషేదం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తెలుగుదేశం, జనసేన కలయిక శుభ పరిణామమని రాష్ట్ర అభివృద్ధికి అధికారంలోకి రానున్న తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని, అలాగే తన అనుభవంతో నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడుపుతానన్నారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు పెద్దయెత్తున హాజరయ్యారు.

గ్రూపులు వద్దు.. సమస్యలుంటే తెలపండి

నూజివీడు పట్టణ తెలుగుదేశం పార్టీ సమావేశాన్ని నూజివీడు ఆర్.ఆర్. పేటలో నిర్వహించారు. పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్థసారథి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గ్రూపులకతీతంగా ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. నియోజకవర్గంలో సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు.



కైకలూరులో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు

చంద్రబాబుతోనే సుస్థిర పాలన..

కైకలూరు: రాష్ట్రంలో సుస్థిర పాలన చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యమని టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు అన్నారు. శుక్రవారం కైకలూరు కోర్టు రోడ్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అయితే ప్రతి ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తారని, అమ్మ ఒడి ఇద్దరు పిల్లలున్నా ఇస్తారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని ఎక్కడ చూసినా దౌర్జన్యాలు అక్రమ భూదందాలు పెచ్చరిల్లిపోతున్నాయన్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, తెంటు వెంకట రమణ, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, పార్టీ సీనియర్ నాయకుడు వేములపల్లి కారుణ్య, తెంటు నాగేశ్వరరావు, ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వేగిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పెదగొన్నూరులో శంఖారావం నిర్వహిస్తున్న టీడీపీ-జనసేన

పెదగొన్నూరులో శంఖారావం

ముదినేపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలు రాష్ట్రాభివృద్ధికి కీలకమైనవిగా భావించి ప్రతి ఒక్కరూ టీడీపీ - జనసేన కూటమిని ఆదరించాలని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ కోరారు. పార్టీ ఆదేశాలతో శుక్రవారం ముదినేపల్లి మండలంలో శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెదగొన్నూరులో టీడీపీ రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు జనసేన ఆశయాలను ఇంటింటా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల అమలుతోపాటు యువతకు ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తదితర పథకాలను అమలు చేసి పేదరిక నిర్మూలనకు కూటమి కృషి చేస్తుందని వినోద్ తెలిపారు. సీనియర్ నాయకుడు, చేనేత సొసైటీల మాజీ అధ్యక్షులు బట్టు నాగ మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు యార్లగడ్డ గంగయ్య, వీరంకి చక్రపాణి, ముగ్గుళ్ల వెంకటేశ్వరరావు, పంతగాని సురేష్, దావు నాగరాజు, బొమ్మినంపాడు, దాకరం సర్పంచ్‌లు దారం సుధ, జాస్తి రాజా, జనసేన నాయకులు గుడిసేన సురేష్, బత్తుల హరీష్ తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో నిరసన ప్రదర్శన

రైతులపై కాల్పులు దారుణం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23: రైతులపై కాల్పులకు దిగటం దారుణమని, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు అన్నారు. నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్ వద్ద సెంట్రల్ ట్రేడ్ యూనియన్, రైతు సంఘాలు ఆధ్వర్యంలో పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో రైతులపై కాల్పులను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ పోలీసులు కాల్పుల్లో యువరైతు శోభాకర్ సింగ్ మృతి చెందటం, మరికొందరు రైతులు గాయపడటం దారుణమన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దింపాలన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బత్తుల వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, మడుపల్లి నాగేంద్రరావు, ఒగ్గు ప్రేమచంద్ర, వెంకటేశ్వరరావు, చలసాని జగన్మోహన్‌రావు, అక్కినేని వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



డెక్క, తూడు తొలగిస్తున్న దృశ్యం

కాల్వలో గుర్రపు డెక్క తూడు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కలిదిండి, ఫిబ్రవరి 23 : గుర్వాయిపాలెం - పెదలంక పంట కాల్వలో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడును ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 12న 'పంట కాల్వలు ఇలా.. సాగు నీరెలా' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు 13 కిలోమీటర్ల మేర కాల్వలో పేరుకుపోయిన తూడు తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ ఏఈఈ సిద్ధార్థ్ తెలిపారు. ప్రస్తుతం గుర్వాయిపాలెం నుంచి భాస్కరరావుపేట వరకు పంట కాల్వలో తూడు తొలగించారు. మూల్లంక నుంచి పెదలంక వరకూ సుమారు 7 కిలోమీటర్ల మేర పనులు మిగిలి ఉన్నాయి. పూడికతీత పనులు పూర్తి చేస్తేనే పెదలంక తాగునీటి చెరువు వద్దకు నీటి వంతు చేరుతుందని, త్వరితగతిన పూడిక తొలగింపు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రై సైకిల్, వీల్ చైర్ వితరణ

కలిదిండి, ఫిబ్రవరి 23 : కాళ్లపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మౌనిషా, ఆరుతెగల పాడు జడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థిని గణేశ్వరికి నియోజకవర్గ బీటీడీపీ ఇన్‌చార్జ్ వేంపాటి ప్రవీణ్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆర్థిక సాయంతో ట్రై సైకిల్, వీల్ చైర్‌ను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వేంపాటి ప్రవీణ్ మాట్లాడుతూ ట్రై సైకిల్, వీల్ చైర్‌లు అవసరమైన దివ్యాంగులు తనను సంప్రదించాలన్నారు. దివ్యాంగులకు సాయమందించటానికి దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. మేడిశెట్టి వెంకట రత్నం, మేడెం సత్యనారాయణ, గుడిపాటి రామకృష్ణ, వేంపాటి మధు, నాగరాజు పాల్గొన్నారు.





రమణక్కపేటలో మాట్లాడుతున్న అనంత శ్రీరామ్

బీజేపీతోనే సంక్షేమం : అనంత శ్రీరామ్

ముసునూరు, ఫిబ్రవరి 23: దేశ సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. శుక్రవారం రమణక్కపేట, చెక్కపల్లి, ముసునూరు, కాట్రేనిపాడు గ్రామాల్లో జబర్దస్త్ టీం, సినీ గాయకుల బృందం పర్యటించింది. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలతో పాటు 16 ఏళ్లుగా తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేస్తున్న సేవా కార్యక్రమాలపై జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోద్, ఇమ్మానియేల్ పలు కామెడీ స్కిట్‌లతో అలరిస్తూ వివరించారు. అలాగే సినీ గాయకులు వినూత్న, అరుణ్ కౌండిన్య పాటలతో ఉత్సాహాన్ని నింపారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఇసాక్, మహిళా మోర్చా అధ్యక్షు రాలు రామ లక్ష్మి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు, ఓబీసీ జనరల్ సెక్రటరీ నీలపాల రాట్నాలరావు, తపన ఫౌండేషన్ మండల కార్యదర్శి మారేళ్ళ కృష్ణారావు, సభ్యుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లు పరిశీలించిన ఆర్డీవో

ముసునూరు, ఫిబ్రవరి 23: బలివే గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరి పరిశీలించారు. ఎంపీపీ పాఠశాలలోని 101, 102 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యం లో మండల వ్యాప్తంగా ఉన్న 57 పోలింగ్ కేంద్రాల్లో నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో సీహెచ్.పద్మావతీదేవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎమిలికుమారి, ఎస్ఐ పి.వాసు, బీఎల్వోలు పాల్గొన్నారు.





నాబార్డు సీజీఎం గోపాల్‌కు పీఏసీఎస్ సంఘ నాయకుల వినతిపత్రం

సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి చర్యలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 23 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేందుకు నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్ హామీ ఇచ్చినట్టు ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి బొల్లినేని రఘురామ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.రామాంజనేయులు తెలిపారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబుతోపాటు శుక్రవారం హైదరాబాద్‌లో నాబార్డు సీజీఎంను కలసి పలు సమస్యలపై చర్చించినట్టు తెలిపారు. కెపాసిటీ టు పే ప్రకారం నికర లాభం నుంచి 30 శాతం వరకే సహకార సంఘాల ఉద్యోగులు జీతాలు తీసుకోవాలన్న నిబంధన ఆచరణీయం కాదని, ఎంఎస్‌సీ పథకం కింద పీఏసీఎస్‌లు నిర్మించిన గోదాములకు ఒక్కో సంఘానికి నాబార్డు నుంచి రూ.2 లక్షల గ్రాంటు ఇప్పించాలని, ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్ని ప్రైవేట్ గోదాముల్లో కాకుండా అద్దె ప్రాతిపదికపై సొసైటీల గోదాముల్లో నిల్వ చేయాలని, రుణాలకు సంబంధించి రైతుల నుంచి వసూలు చేసే షేరు ధనాన్ని పూర్తిగా డీసీసీబీలకు జమ చేయకుండా పీఏసీఎస్‌లకు మూడో వంతు కేటాయించాలని, ఆప్కాబ్, డీసీసీబీల లాభాల నుంచి కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసి ఆ ఫండ్ ద్వారా పీఏసీఎస్‌ల ఉద్యోగులకు ఒకే విధమైన వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్న అంశాలపై సీజీఎంకు మెమొరాండం అందజేసినట్టు తెలిపారు. వీటిని పరిశీలిస్తామని హామీ ఇవ్వటమే కాక గోదాముల నిర్మాణానికి గ్రాంటు కోసం దరఖాస్తు చేసుకుంటే పీఏసీఎస్‌లకు మంజూరు చేస్తామని గోపాల్ హామీ ఇచ్చారని రఘురామ్ తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారని తెలిపారు.

పాడి రైతు కుటుంబానికి చెక్కు అందజేత

చాట్రాయి, ఫిబ్రవరి 23: మండలంలోని చిత్తపూరు శివారు కమ్మటూరు పాల సహకార సంఘం సభ్యుడు చల్లగుళ్ళ సత్యనారాయణ ఇటీవల మృతి చెందగా, కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం కింద రూ. 50 వేల చెక్కును శుక్రవారం మృతుడి భార్యకు తిరువూరు మేనేజర్ సాంబశివ మూర్తి, సంఘం అధ్యక్షుడు పొన్నగంటి శ్రీనివాసరావు అందజేశారు.



జన ఔషధి కేంద్రం ప్రారంభం

కైకలూరు, ఫిబ్రవరి 23: ఔషధి కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన మందులను అందించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కైక లూరు తాలుకా సెంటర్లో కృష్ణాజిల్లా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ అన్నిరకాల మందు లను అందుబాటులో ఉంచి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించాలని సూచించారు. ఎంపీపీ అడవి కృష్ణ, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



మెరుగైన వైద్యం చేయాలి

మండవల్లి, ఫిబ్రవరి 23: మండవల్లి పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్యం చేయాలని మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ సూచించారు. 24 గంటల వైద్యశాలగా మార్పు చేసిన దృష్ట్యా శుక్రవారం రాత్రి ఆమె ఆసుపత్రి పనితీరును పరిశీలించారు. రోగులకు వైద్య సదుపాయాలు, మందుల పంపిణీలో వైద్యులు స్నేహభావంతో ముందుకు సాగాలన్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వైద్యులు అందుబాటులో ఉండాలని ఆమె పేర్కొన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్



పరిసరాల పరిశుభ్రతపై ప్రదర్శన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రదర్శన

పరిశుభ్రతపై ర్యాలీ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23: నూజివీడు మండలం మిట్టగూడెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. నూజివీడు ఉద్యానవన శాఖ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. మిట్టగూడెం సర్పంచ్ కొనకళ్ళ నరసింహారావు శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా : ముద్దరబోయిన

ముసునూరు, ఫిబ్రవరి 23: తాను రాజకీయాల్లోనే ఉంటానని, నూజివీడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురం బీసీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థ రాజకీయాలతో ముందుకు వెళ్తానన్నారు. తాను ఎక్కడికీ వెళ్ళడం లేదని నూజివీడు నుంచే రాజకీయాల్లో ఉంటానని ముద్దరబోయిన స్పష్టం చేశారు.

కృత్రిమ అవయవాల వితరణ



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 23: ఆగిరిపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్ శాంతాబయోటిక్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కోడూరు ఈశ్వర వరప్రసాద్‌రెడ్డి దివ్యాంగులకు కృత్రిమకాళ్ళు అందజేశారు. తోటపల్లి కృత్రిమ అవయవ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ద్రాక్షాయణి, జి.అండ్.జె లక్ష్మి హోమ్స్ అధినేత కాకర్ల శంకర్‌రావు, అనంతపురం జేఎన్‌టీయూ 1973 ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థుల బృందం తరపున 20 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళను అందజేశారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు 400 మంది దివ్యాంగులకు 500 కృత్రిమకాళ్ళు అందజేసినట్లు తెలిపారు. హీల్ ఆలేఖ్య ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవన దాతలు వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ అనాథలకు, అంధులు, దివ్యాంగులకు కొత్తజీవితం ప్రసాదిస్తున్న హీల్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. దాతలు దుర్గాదేవి కోవెలమూడి, వేగే వాణి, యల మంచిలి శుభాకర్, హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, హీల్ ఇండియా అధ్యక్షులు రామ్ అవతార్ యాదవ్, ఐపీఎస్ హీల్ ఉపాధ్యక్షుడు జీడీవీ ప్రసాదరావు, కోశాధికారి మార్గాని రామచంద్రరావు, క్యాంపస్ ఛైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఈ స్లేట్స్ బహూకరణ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 23: తోటపల్లి ప్రి హైస్కూల్‌లో విజయవాడ పవర్ గ్రిడ్ సబ్‌స్టేషన్ సీనియర్ జనరల్ మేనేజరు కె.నాగమోహన్‌రావు, విద్యార్థులకు ఈ స్లేట్స్ బహూకరించారు. శుక్రవారం ఆయన ప్రీ హైస్కూల్‌ను సందర్శించి మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు పెద్ద బాలశిక్ష, 6, 7, 8 తరగతి విద్యార్థులకు పల్లెవద్దకు సాంకేతిక విద్యలో భాగంగా ఈ స్లేట్స్‌ను బహూకరించారు. ఆగిరిపల్లి ఎంఈవో-1 కె.సర్వేశ్వరరావు, ఎంఈవో-2 ఆనంద్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు టి.శోభన్‌బాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



బాలకృష్ణ స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మాజీ సర్పంచ్ బాలకృష్ణకు సీపీఎం నివాళి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 23: నూజివీడు మండలం పల్లెర్లమూడిలో మాజీ సర్పంచ్ గారపాటి బాలకృష్ణ 7వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్తూపం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు, రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ నివాళులర్పించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు డాక్టర్ స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి ఆయన సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాలకృష్ణ కుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.